

పోలీసుల అదుపులో ఉన్న మాజీ సర్పంచ్‌లు

## అక్రమ అరెస్టులు సరికాదు

**జిల్లెడు చౌదరిగూడ, జూన్ 1,(ప్రభాతవార్త):** గ్రామాల అభివృద్ధి కోసం పనులు చేసి వాటి బిల్లులు చెల్లించాలని అడిగితే అక్రమంగ అరెస్టులు చేయడం సరికాదని జిల్లెడు చౌదరిగూడ మండల మాజీ సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు బాబురావు అన్నారు. పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలనీ డిమాండ్ చేస్తూ సిఎం రేవంత్ ముట్టడికి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బాబురావు మాట్లాడుతూ ఎంతో కష్టపడి అప్పులు చేసి గ్రామాలలో అభివృద్ధి చేశామని, ఈ ప్రభుత్వం వచ్చి రెండు సంవత్సరాలపైన అవుతున్న చేసినపనులకు బిల్లులు చెల్లించకుండ మాజి సర్పంచ్‌లను ఇబ్బందులకు గురిచేస్తుందని అన్నారు. ప్రభుత్వం బిల్లులు ఇవ్వకపోను మాజీ సర్పంచ్ లను అరెస్ట్ చేయడం ఎంతవరకు సమంజసమని అన్నారు. వెంటనే ప్రభుత్వం చొరవ తీసుకోని ఆయా గ్రామపంచాయతీలకు రావాల్సిన బిల్లులు చెల్లించే విధంగా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మల్కాపహాడ్ గ్రామసర్పంచ్ రవీందర్ నాయక్, ఇంద్రనగర్ గ్రామ సర్పంచ్ తనయుడు అక్రమ్, చౌదరి గూడ గ్రామ మాజీ సర్పంచ్ గూడ స్వామి, చింతకుంట గ్రామ మాజీ సర్పంచ్ హరినాయక్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

## మాజీ సర్పంచుల ముందస్తు అరెస్ట్




తలకొండపల్లిలో ధర్నాకు వెళ్తున్న వారిని అరెస్టు చేసిన పోలీసులు

**తలకొండపల్లి, జూన్ 1, ప్రభాతవార్త:**

తలకొండపల్లి మండల మాజీ సర్పంచులు సోమవారం నాడు ధర్నాకు బయలుదేరుతారని సమాచారంతో స్థానిక పోలీసులు వారి ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్కు తరలించారు. మండలంలోని గట్టు ఇప్పలపల్లి జూలపల్లి గ్రామాల మాజీ సర్పంచులు తమ పెండింగ్ బిల్లుల కోసం హైదరాబాదుకు తరలి వెళ్తారని సమాచారంతో పోలీసులు ముందస్తుగా వారిని అరెస్టు చేసి పోలీస్ స్టేషన్కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ సర్పంచుల కు రావలసిన పెండింగ్ బిల్లులు ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఏర్పడి రెండున్నర సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ ఇప్పటివరకు తమకు పెండింగ్ బిల్లులు ఇవ్వలేదని వారు అన్నారు. బిల్లుల కోసం లక్షల రూపాయలు అప్పులు చేసి ఇబ్బందులకు గురవుతున్నామని ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని ఈ సందర్భంగా వారు పెట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో బోస్ వెంకటయ్య విజయ్ కుమార్ రెడ్డి ఉన్నారు.



మాజీ సర్పంచ్‌లను ముందస్తు అరెస్టు చేసిన దృశ్యం

## పాదయాత్ర మేము చేస్తామంటే పరేషాన్ నీకెందుకు

**కేశంపేట, జూన్ 1 ప్రభాతవార్త :**

తామేమి అసాంఘిక కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వెళ్లడం లేదని ప్రజాస్వామ్యబద్ధంగా జిల్లా కలెక్టరేట్‌కు పాదయాత్రగా వెళ్లి ప్రజల గొంతును వినిపిద్దామంటే తెల్లారకముందే ఇండ్ల వద్దకు వచ్చి అక్రమ అరెస్టులు చేసి పోలీస్ స్టేషన్లకు తరలించడం దుర్మార్గమైన చర్య అని కేశంపేట మండలం బిఆర్ఎస్ మాజీ సర్పంచులు ఆవేదన వ్యక్తం చేశారు. కేశంపేట మండలంలోని కొత్తపేట మాజీ సర్పంచ్ కామ్లెకార్ నవీన్ కుమార్, పాపిరెడ్డి గూడ మాజీ సర్పంచ్ తాండ్ర విష్ణువర్ధన్ రెడ్డి, ఇప్పలపల్లి మాజీ సర్పంచ్ ఆంజనేయులు, అల్వాల మాజీ సర్పంచ్ శ్రీనివాస్ లను సోమవారం తెల్లవారుజామున కేశంపేట పోలీసులు అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ ఆవరణలో మాజీ సర్పంచులు మీడియా ప్రతినిధులకు మాట్లాడుతూ. కొత్తూరు మండలంలోని సిద్ధాపూర్ గ్రామంలో డంపింగ్ యార్డు నిర్మాణానికి ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కొత్తూరు మండలం పారిశ్రామిక ప్రాంతంగా వెలుగొందుతుందని ఇప్పటికే ఆ ప్రాంతంలో తీవ్ర కాలుష్యం వెలువడుతోందన్నారు. సిద్ధాపూర్ గ్రామ ప్రజల ఆకాంక్షను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళదాం అనుకుంటే తమను అక్రమంగా అరెస్టు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టరేట్ కు పాదయాత్ర చేస్తామంటే పాలకులు పరేషాన్ ఎందుకు అవుతున్నారో అర్థం కావడం లేదన్నారు. ప్రజా పాలన అంటే ప్రజల ఆకాంక్షను వ్యక్తం చేయకుండా అరెస్టులు చేసి అణిచివేయడమేనా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం దిగివచ్చి డంపింగ్ యార్డు ప్రతిపాదనను వెనక్కి తీసుకోవాలని లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు తీవ్రం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు.

## కుక్కల దాడిలో రెండు గొర్రెలు మృతి

**ధారూర్, జూన్ 1, ప్రభాత వార్త:** ధారూర్ మండల పరిధిలోని కుమ్మరి పల్లి గ్రామంలో సోమవారం ఉదయం విషాదం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గొల్ల వెంకటయ్య అనే పెంపకం దారుడికి చెందిన గొర్రెల మందపై వీధి కుక్కలు ఒక్కసారిగా దాడి చేశాయి. ఈ దాడిలో రెండు గొర్రెలు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరో మూడు గొర్రెలు తీవ్రంగా గాయపడ్డాయి. ప్రమాదాన్ని గమనించిన యజమాని గొల్ల వెంకటయ్య వెంటనే అప్రమత్తమై కుక్కలను తోలేశారు. అనంతరం గాయపడిన గొర్రెలను చికిత్స నిమిత్తం తక్షణమే నాగారం పశు వైద్య ఆసుపత్రికి తరలించారు. కుక్కల దాడిలో గొర్రెలు మృతి చెందడంతో బాధితుడు వెంకటయ్య తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు ప్రభుత్వం ఆర్థికంగా సహాయం అందించి ఆదుకోవాలని ఆయన కోరుతున్నారు.

కుక్కల దాడిలో గాయపడిన గొర్రెలు



# దేవుని పడకల్లో ముగిసిన క్రికెట్ పోటీలు

**తలకొండపల్లి జూన్ 1, ప్రభాతవార్త:**

తలకొండపల్లి మండల పరిధిలోని దేవుని పడకల్ గ్రామంలో గత వారం రోజులుగా నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలు సోమవారం ముగిశాయి. గ్రామంలో అండర్ 18 క్రికెట్ పోటీలో నిర్వహించగా అనేక జట్లు పోటీలో పాల్గొన్నారు. సోమవారం నాడు నిర్వహించిన చివరి పోటీలలో గోవిందాయ పల్లి గ్రామానికి చెందిన క్రికెట్ జట్టు మొదటి బహుమతి దేవుని పడకల్ గ్రామానికి చెందిన జట్టు రెండో బహుమతి సాధించారు. ఈ సందర్భంగా గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ మండల అధ్యక్షులు కుమ్మరి శంకర్ స్థానిక సర్పంచ్ కానుగుల అనితతో పాటు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



గెలుపొందిన వారికి బహుమతులు అందజేస్తున్న నాయకులు

# నిరుపేద కుటుంబాల్లో ఆర్మీ వెలుగులు

కుల్కచర్ల, జూన్ 1 ప్రభాతవార్త: పట్టుదల ఉంటే పేదరికం అడ్డుకాదని కుల్కచర్ల మండల ఇప్పపల్లి గ్రామానికి చెందిన వంశీ గౌడ్, ప్రసాద్ యాదవ్ అనే యువకులు నిరూపించారు. వ్యవసాయ కూలీల ఇద్దలు అయిన వంశీ గౌడ్, ప్రసాద్ యాదవ్.. కఠిన శ్రమతో ఆర్మి ఉద్యోగం సాధించి నేటి యువతకు ఆదర్శంగా నిలిచారు. ఎలాంటి ఆర్థిక స్థోమత లేకపోయినా, పట్టుదలతో దేశ సేవకు ఎంపికవ్వడం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తంచేశారు. వంశీ గౌడ్, ప్రసాద్ యాదవ్ మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని గ్రామ ప్రజలు, కుటుంబ సభ్యులు అభినందించారు.





ఆర్మి ఉద్యోగం సాధించిన వంశీ గౌడ్, ప్రసాద్ యాదవ్

# రేడియల్ రోడ్డు భూ బాధితులకు న్యాయం చేస్తాం

**చేవెళ్ల ఆర్డిఓ పార్థసింహారెడ్డి**

**షాబాద్, జూన్ 1, ప్రభాతవార్త :** రేడియం రోడ్ భూ బాధితులకు న్యాయం చేస్తామని చేవెళ్ల ఆర్డిఓ పార్థ సింహ రెడ్డి అన్నారు. సోమవారం షాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో తాసిల్దార్ అన్వర్ రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ...ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం హైదరాబాద్ నగరం నుండి ఇతర రాష్ట్రాలకు వెళ్లేందుకు రేడియో రోడ్ నిర్మాణం కోసం ప్రభుత్వం కృషి చేసి నట్లు తెలిపారు. రేడియల్ రోడ్డులో భూముల కోల్పోతున్న వివిధ గ్రామాల రైతుల కు న్యాయం జరిగేలా చూస్తామన్నారు .ఎకరముకు నష్టపరిహారంగా 35 లక్షలు అదనంగా 15 కలిపి ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు .

ఎకరం భూమి కలిగిన రైతుకు 121 గజాల ఇంటి స్థలం ఇచ్చేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. మండలంలో మొత్తం 328 17 గుంటల భూమి కలిగిన రైతులకు నష్టపరిహారం చెల్లించేందుకు ప్రభుత్వం తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు.



రేడియల్ రోడ్డు భూబాధితులతో మాట్లాడుతున్న ఆర్డీవో పార్థ సింహారెడ్డి

# రైతుల సమస్యల పరిష్కారానికి అధికారులు అందుబాటులో ఉండాలి

**షాబాద్, జూన్ 1, ప్రభాతవార్త :** రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు విద్యుత్ శాఖ అధికారులు అందుబాటులో ఉండాలని భారతీయ కిసాన్ సంఘ్ (బీకేఎస్) షాబాద్ మండల అధ్యక్షుడు యాదవరెడ్డి డిమాండ్ చేశారు. షాబాద్ రైతు వేదికలో సోమవారం నిర్వహించిన భారతీయ కిసాన్ సంఘ్ నెలవారీ సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో ఇటీవల వీస్తున్న బలమైన గాలుల కారణంగా అనేక ప్రాంతాల్లో విద్యుత్ తీగలు వదులుగా మారి రైతులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆయన తెలిపారు. విద్యుత్ సమస్యలు తలెత్తినప్పుడు సంబంధిత అధికారులు అందుబాటులో లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, రైతుల ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనందున రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు సమృద్ధిగా అందుబాటులో ఉంచాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రస్తుతం ఎరువుల బస్తాలను కేవలం యాప్ ద్వారా మాత్రమే విక్రయించడం, అద నంగా లిక్విడ్ ఎరువులు కొనుగోలు చేసినప్పుడే ఎరు వుల బస్తాలు ఇస్తున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయని చెప్పారు. ఈ విధానాల పట్ల రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని, ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసు కోవాలని కోరారు. సమావేశంలో బీకేఎస్ జిల్లా సహ కార్యదర్శి సత్యనారాయణ రెడ్డి, మండల కార్యదర్శి కృష్ణ, సోలిపేట నరసింహారెడ్డి, కేశగూడెం ఒగ్గు మల్లేష్‌తో పాటు పలువురు రైతు సభ్యులు పాల్గొ న్నారు.



భారతీయ కిసాన్ సంఘ్ సమావేశంలో మాట్లాడుతున్న మండల అధ్యక్షుడు యాదవరెడ్డి



పెద్దనందిగామలో ఇందిరమ్మ ఇళ్లు గృహప్రవేశంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ అధికారులు

## పెద్దనందిగామలో ఇందిరమ్మ ఇళ్ళ గృహ ప్రవేశాలు

**కొడంగల్, జూన్ 1ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా మండల పరిధిలోని పెద్దనందిగామ గ్రామంలో గ్రామ సర్పంచ్ చెన్‌బస్‌కుమార్ అధ్వర్యంలో ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమం నిర్వహించారు. సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి, ఆర్డీఓ అనిత, ఎంపీడీఓ ఉషశ్రీ, మున్సిపలన చైర్మన్ నందారం ప్రశాంత్ తదితరులు హజరైయ్యారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మేన్ నందారం ప్రశాంత్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా ఇల్లులేని పేదలకు సొంతింటి కల నెరవేర్చేందుకు గాను ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని అమలు చేస్తున్నదని చెప్పారు. పేదవాని సొంతి ఇంటికల కాంగ్రేస్‌తోనే సాధ్యమన్నారు. అనంతరం గ్రామానికి చెందిన ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులైన కుమ్మరి మల్లమ్మ, రషీదాబి, అజిమాబేగం, వంశరాజ్ సత్యమ్మ, కొత్తపల్లి బప్పాలిలా తదితరులు నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాల కార్యక్రమం అట్టహసంగా జరిగింది. ఈ కార్యక్రమంలో హౌసింగ్ డీఈ చందర్, ఏఈ భాస్కర్, కాంగ్రేస్ మండల వర్కింగ్ ప్రసిడెంట్ ఆనంద్‌రెడ్డి, గ్రామ మాజీ సర్పంచ్ సంజీవరెడ్డి ,మార్కెట్ కమిటీ డైరెక్టర్ కె.సత్యనారాయణరెడ్డి, మైనార్టీ వైస్ ప్రసిడెంట్ ఆరిఫ్, లింగం చంద్రప్ప, కె.బీమప్ప, ఎండీ.ఆరీఫ్, లింగం వినోదన, మాదారప్ప ,సుధాకర్, కిష్టప్ప, పావన్న, రవేష్‌గౌడ్, సీత్యానాయక్, కె.మోహన్, గొల్ల వెంకటేష్, మంగలి క్రిష్ణ, రఫీం తదితరులు పాల్గొన్నారు.

## టేకులపల్లిలో సామూహిక ఇందిరమ్మ ఇండ్లు ప్రారంభం

**మోమిన్‌పేట్, జూన్ 1. ప్రభాతవార్త:** ఇండ్లులేని నిరుపేదలకు ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడం జరుగుతుందని స్థానిక సర్పంచ్ బండ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. సోమవారం మోమిన్‌పేట్ మండల పరిధిలోని టేకులపల్లి గ్రామంలో ఆయన సామూహిక ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతు నేడు గ్రామంలో లంక నర్సింహ్మారెడ్డి, ప్రశాంత్‌నగర్‌లో కొండ గల్ల ఎవన్ ఇండ్లను రిబ్బన్ కట్ చేసి నూతన గృహాలను ప్రారంభించారు. అలాగే ఇల్లు లేనటువంటి, అర్హులైన నిరుపేదలకు ప్రతి ఒక్కరికి రెండవ విడతలో ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయిస్తామని అన్నారు. గ్రామంలో కులమతాలకతీతంగా, రాజకీయాలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి న్యాయం చేయడమే కాకుండా, మండలంలో ఆదర్శగ్రామంగా టేకులపల్లిని తీర్చిదిద్దడమే నా లక్ష్యమని పేర్కొన్నారు. గ్రామస్తులు ప్రతి ఒక్కరు స్వచ్ఛందంగా తమ ఓటు వేసి అత్యధిక భారీ మెజారిటీతో నన్ను గెలిపించిన గ్రామస్తుల రుణం తీర్చుకోవడం నా ప్రథమ కర్తవ్యమని అదే నా లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతి వార్డు సభ్యులు నీలి శ్రీనివాస్, అడివయ్య, ప్రసాద్ కుమార్, గ్రామ పెద్దలు మాజీ పర్పంచులు పట్లోళ్ల మల్లారెడ్డి, పర్మయ్య, సీనియర్ నాయకులు మహెందర్‌చారి, విఠల్‌రెడ్డి, మహబూబ్, అక్బర్, మురళీధర్ రెడ్డి, సత్యనారాయణ, వెంకటేశం, శ్రీకాంత్, కుమార్, పంచాయతి కార్యదర్శి మాధవి, పంచాయతీ కారోబార్ నర్సింలు తదితరులు పాల్గొన్నారు.



సామూహిక ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభిస్తున్న సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు.

## ఇందిరమ్మ ఇంటితో పేదల కల నేరవేరింది

**రంగారెడ్డి అర్బన్ జూన్1 ,ప్రభాతవార్త :** ఇందిరమ్మ ఇంటితో పేదల కళ సహకారమైందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు. తెలంగాణ గృహ నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ గృహాల గృహప్రవేశాల ఉత్సవం సోమవారం శంషాబాద్ మండ లంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులతో కలిసి స్వయంగా రిబ్బన్ కట్ చేసి, సాంప్రదాయబద్ధంగా పూజా కార్యక్రమాలు నిర్వహించి లబ్ధిదారుల కుటుంబాలకు నూతన గృహాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ...రాష్ట్రవ్యాప్తంగా లక్ష గృహప్రవేశాలు కల్పించాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది. అందులో భాగంగా రంగారెడ్డి జిల్లాలో 3,144 ఇళ్లను లబ్ధిదారులకు అందించడం ఎంతో సంతోషకరం. అందరికీ ఇల్లు సురక్షి త నివాసం అనే లక్ష్యంతో ప్రతి పేదకుటుంబానికి సొంత ఇల్లు, సొంత గౌరవాన్ని అందించడమే ఈ ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వం తోడుగా ఉంటూ ప్రతి కుటుంబానికి శుభాభినందనలు తెలియజేస్తోందని అన్నారు. అనంతరం సొంత ఇంటి కల నెరవేరినందుకు లబ్ధిదారులు ఎమ్మెల్యేకి మరియు ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు, గ్రామ పెద్దలు, గృహ నిర్మాణ శాఖ అధికారులు మరియు భారీ సంఖ్యలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



ఇందిరమ్మ గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

## ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశాలు

**మేడ్చల్, జూన్ 1, ప్రభాతవార్త :** మేడ్చల్ డివిజన్‌లో కొండలి హైమవతి, మార్గాల నాగమణి, మార్గాల లలిత, ప్రసన్నలు నిర్మించు కున్న ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశ కార్యక్రమాన్ని అధికారికంగా నిర్వహించారు. కార్యక్రమానికి విచ్చేసిన మేడ్చల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సుధాంష్, డిప్యూటీ తహసీల్దార్ ముందుండి లబ్ధిదారులను గృహ ప్రవేశాలు చేయించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, గుండ్ల పోచంపల్లి మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్, మాజీ వైస్ చైర్మన్ రమేష్, నాయకులు రాఘవేందర్ గౌడ్, మణికంఠ గౌడ్, బాల్ రెడ్డి, సురేందర్ ముది రాజ్, బిపిటి రాజు, శంకర్, రేగురాజు, సత్య నారాయణ, కొడెమహేష్ సత్తిరెడ్డి, బాల మల్లేష్, రఘుపతి రెడ్డి, వెంకట రామిరెడ్డి, భూపాల్ రెడ్డి, రంజిత్, మోనార్క్, పాల్గొన్నారు .




ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, నాయకులు



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ దీపక్ తివారి

## ప్రజావాణి దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలి

**వికారాబాద్, ప్రభాతవార్త :** జిల్లా లో నిర్వహించే ప్రజావాణిలో వచ్చిన దరకాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశము హాలు నందు ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమంలో అధికారులను ఉద్దేశించి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణి ద్వార వచ్చిన దరఖాస్తు లను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అధికారులకు ఆదేశించారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు సమస్యలు విన్నవిస్తూ దరఖాస్తు లు సమర్పించా రని కలెక్టర్ తెలిపారు.

ఆర్ డి ఓ, తహసిల్దార్‌ల పరిధిలో స్వీకరించిన దరకాస్తులను పెండింగ్ ఉంచకుండా సత్వరమే పరిష్కరించాలని అన్నారు. ప్రతి ఫిర్యాదు పై తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాశించారు. ముఖ్యంగా భూ సంబంధిత సమస్యలు, ఆసరా పెన్షన్లు, రేషన్ కార్డులు, గృహనిర్మాణము, వ్యవసాయం, ఉపాధి, జిల్లా పంచాయతి, భూ సర్వే వివిధ అంశాలపై వచ్చిన దరఖాస్తు లపై దృష్టి పెట్టాలన్నారు. ప్రజావాణి కార్యక్రమం ద్వారా 110 దరఖాస్తులు వచ్చాయని, ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని వేగంగా పరిష్కరించెందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటాచారి, అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్. జడ్‌పి సిఇఓ సుధీర్, డిఆర్‌డిఎ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## జవహర్ నగర్‌లో అక్రమ కట్టడాల కూల్చివేత

**జవహర్‌నగర్, జూన్ 1, ప్రభాతవార్త:** జవహర్ నగర్ ప్రభుత్వ భూములను ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపట్టే వారిపై క్రిమినల్ కేసులతో పాటు పీడీ యాక్ట్ కింద కూడా చర్యలు తీసుకుంటామని కాప్రా తహసీల్దార్ బైరెడ్డి రాజేష్ హెచ్చరించారు. జవహర్ నగర్ పరిధిలో పూర్తిగా ప్రభుత్వ భూములే ఉన్నాయని, పేద ప్రజలు ప్లాట్లు కొనుగోలు చేసి మోసపోవద్దని సూచించారు. తహసీల్దార్ రాజేష్ ఆదేశాల మేరకు సోమవారం జవహర్ నగర్‌లోని పలు అక్రమ కట్టడాలను రెవెన్యూ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ పర్యవేక్షణలో రెవెన్యూ సిబ్బంది కూల్చివేశారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ ప్రభుత్వ భూముల పరిరక్షణకు రెవెన్యూ శాఖ కట్టుబడి ఉందన్నారు. ప్రభుత్వ భూములను ఆక్రమించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అంబేద్కర్ నగర్, లక్ష్మీ నరసింహ కాలనీలలో ప్రభుత్వ భూములపై అక్రమంగా నిర్మించిన కట్టడాలను అధికారులు తొలగించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రతి ఊరికీ ప్రగతి ఫలాలు

(మొదటి పేజీ తరువాయి)

సహకారంతో తాను అసెంబ్లీ స్పీకర్ హోదాలో ఉండడంతో వికారాబాద్ నియోజకవర్గానికి నిధులు పెద్ద ఎత్తున వస్తున్నాయని తెలిపారు. ప్రతి గ్రామంలో గల్లిగల్లికి రూ.50 లక్షలతో సిసి రోడ్లు వేయించానని, రూ.650 కోట్లతో ఆర్‌అండ్‌బి, పంచాయతీ రాజ్ రోడ్లు వేయిస్తున్నామని పేర్కొన్నారు. మహిళలకు బస్సులలో ఉచిత పయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు, 500 రూపాయలకే సబ్సిడీ గ్యాస్ సిలిండర్ పంపిణీ, కొత్త రేషన్ కార్డులు, సన్న బియ్యం పంపిణీ, ఇందిరమ్మ బీమా పథకాలు అమలవుతున్నాయని తెలిపారు. రైతులకు పెద్ద ఎత్తున రుణమాఫీ అయ్యిందని, గత ప్రభుత్వం పదేళ్ళలో డబుల్ బెడ్ రూం ఇళ్ళు ఒక్కటి ఇవ్వలేదని, ప్రస్తుత ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరై, నిర్మాణం పూర్తయి గృహప్రవేశాలు కూడా జరుగుతున్నాయని అన్నారు. ఇల్లు లేని పేదలందరికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని, గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రి 7 లక్షల కోట్ల రూపాయల అప్పులు చేసి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను అస్తవ్యస్తం చేశారని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమర్థుడు అయినందున, గత ప్రభుత్వం చేసిన అప్పుకు నెలకు రూ.6,500 కోట్ల మిత్తి చెల్లిస్తూ మరోపక్క అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని గుర్తు చేశారు. ప్రస్తుత ప్రజా ప్రభుత్వంలో ప్రతి ఇంటికి ఏదో ఒక సంక్షేమ పథకాలు అందుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వినయ్‌కుమార్, ఆర్టీఏ మెంబర్ జాఫర్, వికారాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ చాపల శ్రీనివాస్, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు బిల్లపాటి రాజశేఖర్‌రెడ్డి, నాయకులు గొట్టిముక్కుల శ్రీనివాస్, పాల్గొన్నారు.

## రూ.గజం లక్ష

(మొదటి పేజీ తరువాయి)

కలెక్టర్ మనుచౌదరి అందజేశారు. సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో రైతులకు చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగ కలెక్టర్ మనుచౌదరి మాట్లాడుతూ రెండవ దఫాగ ఈ చెక్కులను అందజేయటం జరిగిందన్నారు. మిగిలిన వారికి తరువాత అందజేయనునన్నట్లు తెలిపారు. ఇదీ నిరంతర ప్రక్రియ అని అన్నారు. తమ భూమికి చదరపు గజం లక్ష రూపాయలుగా ధర నిర్ణయించటంలో కలెక్టర్ చొరవ తీసుకున్నారని పలువురు రైతులు హర్షం వ్యక్తం చేసి కలెక్టర్ మనుచౌదరికి కృతజ్ఞతలు తెలిపారు. తమ భూమి చదరపు గజం లక్ష రూపాయలు నిర్ణయించటంలో చొరవ తీసుకున్న కలెక్టర్‌ను, తమ చెక్కులు అందించటంలో ప్రత్యేక శ్రద్ద వహించిన ఎస్‌డిసిఎల్ మాలతిని శాలువాతో రైతులు సత్కరించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో తూంకుంట గ్రామ మాజీ సర్పంచు ఎద్దు నాగేశ్‌యాదవ్, పలువురు రైతులు తదితరులు పాల్గొన్నారు.



తూంకుంటలో గజం లక్ష రూపాయలు ధర నిర్ణయించినందుకు తూంకుంట గ్రామ రైతు ఎద్దు కిష్టయ్య, కుటుంబ సభ్యులు కలెక్టర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

## ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

**ఘట్‌కేసర్, జూన్ 1, ప్రభాతవార్త:** మద్యం మత్తులో ఇంటిపై నుంచి కింద పడ్డ ఓవ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. కార్మికుడు దినారామ్ (22) మే 29న రాత్రి పనిముగించుకొని ఘట్‌కేసర్‌లో తన తోటి వారితో కలిసి మద్యం తాగాడు. తర్వాత మద్యం మత్తులో తాను ఉంటున్న ఇంటిపైకి ఎక్కగా ప్రమాదవశాత్తు జారీ కింద పడిపోయాడు. స్థానికులు వెంటనే ఆసుపత్రికి తరలించి అనంతరం మెరుగైన చికిత్స కోసం గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా దినారామ్ ఆరోగ్య పరిస్థితి విషమించడంతో సోమవారం ఉదయం మృతిచెందాడు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నామని ఘట్‌కేసర్ ఎస్ఐ రాఘవేందర్ తెలిపారు.

# సిఎం సహాయనిధి నిరుపేదలకు వరం

**కీసర, జూన్1, ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి సహాయనిధి నిరుపేదలకు వరంగా మారిందని కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రామిడి విజయ్‌రెడ్డి తెలిపారు. సోమవారం కీసర సర్కిల్ పరిధిలోని కీసర గ్రామానికి చెందిన జూపల్లి నర్సింహకి 40 వేల రూపాయల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు నిజంగా అర్హులైన పేదలకు చేరాలన్నారు. అనారోగ్యం, ప్రమాదాలు, ఆర్థిక ఇబ్బందులతో ఇబ్బంది పడుతున్న పేద కుటుంబాలకు సిఎం సహయనిధి ఎంతో ఊరటనిస్తుందని పేర్కొన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తమ సమస్యలను ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. భవిష్యత్తులో కూడా ప్రజలకు అన్ని విధాలుగా అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ తటాకం లక్ష్మణ్‌శర్మ, మాజీ ట్రస్టుబోర్డు సభ్యులు రెడ్డబోయిన ప్రవీణ్, మేడ్చల్ అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ వెంకట్‌చారి, నాయకులు మల్లేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


చెక్కులను అందజేస్తున్న కాంగ్రెస్ నేత విజయ్‌రెడ్డి

# నాగారం అభివృద్ధికి కృషి చేస్తా

**కీసర, జూన్1, ప్రభాతవార్త:** నాగారం డివిజన్‌లోని వివిధ కాలనీల అభివృద్ధికి కృషి చేస్తానని మాజీ కౌన్సిలర్ పంగ హరిబాబు అన్నారు. సోమవారం నాగారం ఎస్‌వి నగర్ కాలనీ ఎంట్రన్స్ కమాన్ నుండి ఐంకామ్ కంపెనీ వరకు హెచ్‌ఎండిఎ రేడియల్ మెయిన్ రోడ్డులో రూపాయలు 95 లక్షల వ్యయంతో చేపట్టనున్న సెంట్రల్ మీడియన్ గ్రిల్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగారం డివి జన్‌లోని వివిధ కాలనీల అభివృద్ధికి ఎల్లప్పుడూ ముందంజలో ఉంటానన్నారు. ప్రజ లకు ఏ సమస్య వచ్చిన తన దృష్టికి తీసుకువస్తే అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్య క్షులు ముప్పు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు సతీష్ గౌడ్, నర్సింగ్ రావు, సన్నీ యాదవ్, కందిడి శ్రీనివాస్‌రెడ్డి, రాజిరెడ్డి, శివనాయక్ తదితరులు పాల్గొన్నారు.


నాగారంలో సెంట్రల్ మీడియన్ గ్రిల్ పనులను ప్రారంభించిన మాజీ కౌన్సిలర్ పంగ హరిబాబు

## రైలు ప్రమాద మృతులకు అడ్వకేట్ అంజి యాదవ్ దహన సంస్కారాలు

**నందిగామ, జూన్ 1, ప్రభాతవార్త :** కట్టెల కోసం వెళ్లి కాలినడకన డబుల్ రైల్వే ట్రాక్ దాటే ప్రయత్నంలో రైలు ఢీకొని మృతి చెందిన యువతులకు సోమవారం నందిగామ శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. పదేళ్ల క్రితం ఉపాధి కోసం బీహార్ నుండి వలస వచ్చిన వీరి కుటుంబ సభ్యులు నందిగామలో నివాసమంటూ దినసరి కూలీలుగా పనిచేస్తున్నారు. మృతుల్లో చున్మాన్ కుమారి (15) నందిగామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎనిమిదవ తరగతి చదువుతోంది. ఆదివారం సెలవు దినం కావడంతో చున్మాన్ కుమారితో పాటు మరో ఆరుగురు కట్టెల కోసం వెళ్లారు. వీరందరూ నెత్తిన కట్టెల మోపుతో తిరుగు పయనమయ్యారు. డబుల్ ట్రాక్ దాటే క్రమంలో ప్రీతి, చున్మన్ల తలపై ఉన్న కట్టల మోపును రైల్ ఢీ కొట్టింది. మితిమీరిన స్పీడుతో ఉన్న రైలు కట్టెలకు తగలడంతో వీరు ఇరువురు పక్క ట్రాక్ పై పడ్డారు. తలలకు బలమైన గాయాలు కావడంతో చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న వీరిని అదే ట్రైన్‌లో షాద్‌నగర్ రైల్వే స్టేషన్ తీసుకెళ్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఇరువురి మృతితో వలస కూలీల శిబిరంలో విషాదం అలుముకుంది. కట్టెల కోసమని వెళ్లి ఇద్దరు కాటికి వెళ్లిన సంఘటనపై మానవతా హృదయంతో అడ్వకేట్ అంజి యాదవ్ అన్నీ తానై ఇరువురి మృతి దేహాలకు అంత్యక్రియలు జరిపించారు. గ్యాస్ దొరికి ఉంటే కట్టెలకు వెళ్లే వారే కాదని గ్యాస్ కొరత మూలంగానే ఇరువురి నిండు ప్రాణాలు కోల్పోవలసి వచ్చిందని వలస కూలీల శిబిరంలో మహిళలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

# గడ్డం ప్రసాద్ కుమార్‌కు మంత్రి పదవి ఇవ్వాలి

**కోట్‌పల్లి మండల ఎస్సీసెల్ అధ్యక్షులు తలారి శశికాంత్**

**కోట్‌పల్లి, జూన్ 1, ప్రభాతవార్త:** కోట్‌పల్లి తెలంగాణ రాష్ట్ర శాసన సభ సభాపతి వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్‌కుమార్‌కు మంత్రి పదవి ఇవ్వాలని కోట్‌పల్లి మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు తలారి శశికాంత్ అన్నారు. సోమవారం నాడు కోట్‌పల్లి మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ గడ్డం ప్రసాద్ కుమార్‌కు మంత్రి పదవి కల్పించడంతో సామాజిక న్యాయం సాధ్యమవుతుందన్నారు. దళితులు, బలహీన వర్గాలకు రాజకీయంగా తగిన ప్రాతినిధ్యం కల్పించాలనే ఉద్దేశ్యంతో గడ్డం ప్రసాద్ కుమార్‌ను మంత్రివర్గంలో స్థానం కల్పించాలన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చేనేత జౌళి శాఖ మంత్రిగా కుడా పని చేసిన అనుభవంతో పాటు ప్రజాసమస్యలపై ఆయనకు ఉన్న అవగాహన తెలంగాణ రాష్ట్రానికి ఎంతో ఉపయోగపడుతుందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. గడ్డం ప్రసాద్‌కుమార్ కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ఉండి పని చేశారని ఆయన గుర్తు చేశారు. రాజకీయ జీవితంలో ఎన్నో అవకాశాలు వచ్చిన ఎలాంటి ఒత్తిళ్లకు లొంగకుండా కాంగ్రెస్ పార్టీని నమ్ముకొని పార్టీ కోసం ప్రజల కోసం పనిచేసిన గొప్ప నాయకుడు ప్రసాద్‌కుమార్ అన్నారు. ప్రసాద్ కుమార్‌కు మంత్రివర్గంలో కీలకమైన శాఖతో కూడిన మంత్రి పదవి ఇవ్వాలని ఆయన పేర్కొన్నారు.

# కోనేరులో పడి మహిళ మృతి

**షాద్ నగర్, జూన్ 1, ప్రభాతవార్త :** ఫరూఖ్ నగర్ మండలం పరిధిలో రామేశ్వరం కోనేరులో ఓ మహిళ పడి మృతి చెందిన ఘటన సోమవారం తెల్లవారుజామున వెలుగులోకి వచ్చింది. నందిగామ మండలంలోని శ్రీనివాసుల గూడా గ్రామానికి చెందిన జన్ముల సువర్ణ (45) రాత్రి పున్నమి సందర్భంగా రామేశ్వరం దర్శనార్థం వచ్చింది. తెల్లవారుజామున కోనేరులో స్నానం చేసేందుకు వెళ్లగా ప్రమాదవశాత్తు కోనేరులో జారిపడింది. ఇది గమనించిన భక్తులు అక్కడికి చేరుకొని సువర్ణని బయటకు తీయగా ఆమె అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలి కుమారుడు అశోక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం షాద్ నగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

# అయ్యప్ప స్వామి ఆలయఅభివృద్ధికి కృషి చేస్తా

**కుల్కచర్ల, జూన్,1 ప్రభాతవార్త:** అయ్యప్ప స్వామి ఆలయా అభివృద్ధికి కృషి చేస్తా నని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి కొండపై స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆయ్యప్ప సేవ సమితి ఆధ్వర్యంలో ఆలయ ఆవరణ పరిధిలో అభివృద్ధి పనులపై వినతి పత్రం అందజేశారు. ఈ సంద ర్భంగా ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి సానుకూలంగా స్పందించి ఆలయానికి ప్రత్యేక నిధులతో అభివృద్ధి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆంజి లయ్య, డిసిసి జిల్లా ఉపాధ్యక్షులు భీంరెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ కనకం మొగు లయ్య, మార్కెట్ కమిటి చైర్మన్ ఆంజనేయులు, మండల అధ్యక్షులు గోపాల్ నాయక్ అయా గ్రామాల సర్పంచులు, సినియర్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



# అవతరణ వేడుకలకు పకడ్డందీ ఏర్పాట్లు

(మొదటి పేజీ తరువాయి)

ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు, వివిధ వర్గాల ప్రతినిధులు పాల్గొనే కార్యక్రమం కావడంతో ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. వేడుకల నిర్వహణలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా శాఖల మధ్య సమన్వయం ఉండాలని, ప్రతి ఏర్పాటును ముందుగానే పరిశీలించి లోటుపాట్లను వెంటనే సరిదిద్దాలని కలెక్టర్ స్పష్టం చేశారు. కార్యక్రమం ముగిసే వరకు అధికారులు అప్రమత్తంగా ఉండి తమ విధులను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. పరిశీలన కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు, పోలీసు శాఖ ప్రతినిధులు, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు. రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని జిల్లాలో ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు దాదాపు పూర్తయ్యాయని అధికారులు కలెక్టర్‌కు వివరించారు.

# ప్రజల సురక్షితమే పోలీస్ ధ్యేయం

**కీసర, జూన్1, ప్రభాతవార్త :** కీసర పోలీస్‌స్టేషన్‌ని మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ సిపి సుమతి సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లోని సిసి కెమెరాల పనితీరు, స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, వివిధ విభాగాల నిర్వహణ, ఇతర సౌకర్యాలను పరిశీలించారు. క్రైమ్ విభాగం సిబ్బందితో, రిసెప్షన్, ఇతర విభాగాల సిబ్బందితో మాట్లాడి వారి విధులపై అవగాహనను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత సమర్థవంతంగా వినియోగించి ప్రజలకు వేగవంతమైన సేవలు అందించాలని సూచించారు. పోలీస్‌స్టేషన్ ఆవరణను పరిశీలించిన సిపి అక్కడ పరిశుభ్రత, పచ్చదనం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. విభాగాల ఇన్‌చార్జిలు, స్టేషన్ సిబ్బందితో ప్రత్యేకంగా సమావేశమై విధుల నిర్వహణలో మరింత చురుకుదనం ప్రదర్శించాలని ఆదేశించారు. అలాగే సాంకేతిక యాప్‌ల వినియోగం, ఎన్‌పిడిఎస్ కేసుల దర్యాప్తు, మీ సురక్ష అప్లికేషన్‌లో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచడం వివరాలను ఎప్పటికప్పుడు ధృవీకరించడం వంటి అంశాలపై దిశానిర్దేశం చేశారు. ప్రజలకు సురక్షితమైన, పారదర్శకమైన సేవలు అందించే దిశగా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిఐ అర్కపల్లి ఆంజనేయులు, ఎస్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


వృద్ధుడితో ముచ్చటిస్తున్న సిపి సుమతి

# లక్ష్మీనరసింహస్వామికి ముఖతోరణం సమర్పణ

**తలకొండపల్లి, జూన్ 1, ప్రభాతవార్త:** తలకొండపల్లి మండల కేంద్రంలోని లక్ష్మీ నరసింహస్వామి దేవాలయంలో నూతనంగా స్వామివారికి ముఖ తోరణం, నాగాభరణం ప్రతిమలు సోమవారం నాడు గ్రామానికి చెందిన అమృత భాగ్యలక్ష్మి ప్రకాశం దంపతులు సమర్పించారు. అనంతరం దేవాలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము లక్ష్మీ నరసింహస్వామి భక్తులమని అందుకని దేవాలయంలో స్వామివారికి సమర్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగ్యలక్ష్మి ప్రకాశం దంపతులు సర్పంచ్ల సంఘం మండలాధ్యక్షులు కటికల శేఖర్ యాదవ్ కటికల పాండు యాదవ్ రవి నాయక్ దుర్గపురం రవి తదితరులు పాల్గొన్నారు.

# సిఎం రిలీఫ్ ఫండ్‌తో పేదలకు ఎంతో మేలు

**కుల్కచర్ల, జూన్ 1 ప్రభాతవార్త:** సిఎం రిలీఫ్ ఫండ్‌తో పేదలకు ఎంతో మేలుజరుగుతుందని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి అన్నారు. సోబవారం మండల కేంద్రంలోని ఆయా గ్రామాలకు చెందిన వారు ఆనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందినవారికి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. .కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు అండగా నిలుస్తుందని అన్నారు. ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ పథకాలుప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయా గ్రామాల సర్పంచులు, లబ్దిదారులు పాల్గొన్నారు.


లబ్దిదారులకు సిఎం రిలీఫ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

# గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ లక్ష్యం

**కేశంపేట, జూన్ 1, ప్రభాతవార్త :** కేశంపేట మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలో శ్రీ హనుమాన్ రామలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం వద్ద ఆర్ డబ్ల్యూ ఎస్ డీఈ అబ్దుల్ బారీతో కలిసి గ్రామసర్పంచ్ పట్లూరి హైమావతి జగదీశ్వర్ నూతన బోరుమోటారును ప్రారంభించారు. ఈ సందర్భంగా హైమావతి జగదీశ్వర్ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అనేక రకాలైన సంక్షేమ పథకాలను అమలు చేస్తుంది. అందులో భాగంగా కొత్తపేట గ్రామంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకారంతో ఎస్ డి ఎఫ్ నిధులు మూడు లక్షల రూపాయలతో ఆలయానికి వచ్చే భక్తులు, ప్రజలకు నీటికొరత తలెత్తకుండా నూతనంగా బోరు వేయించి త్రి ఫేజ్ మోటారును ఏర్పాటుచేసినట్టు తెలిపారు. గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పించ డానికి గ్రామ పాలకవర్గంతో కలిసి కృషి చేస్తున్నామన్నారు. వివిధ కాలనీ లలో నీటి ఎద్దడి తలెత్తకుండా సింగిల్ ఫేజ్ మోటార్లను బిగించామన్నారు. ఎమ్మెల్యే సహకారంతో గ్రామాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తామని సర్పంచ్ అన్నారు. బోర్ వేయించాలని కోరిన వెంటనే స్పందించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, సర్పంచ్ పట్లూరి హైమావతి జగదీశ్వర్ లకు ఐదవ వార్డు సభ్యులు పుట్నాల అనూష రాజు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జగన్, వార్డు సభ్యులు కాడేమోని జంగయ్య, కంటం యాదయ్య, కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు వట్టెల ఆంజయ్య, నాయకులు రంగు శంకర్, నిర్ధవెల్లి జంగయ్య, మామిడి యాదయ్య గౌడ్, లెంకపోతుల కుమార్ గౌడ్, పుట్నాల కృష్ణయ్య, అక్బర్, రమేష్, మల్లేష్, కారోబార్ జంగయ్య పాల్గొన్నారు.


బోరు మోటార్‌ను ప్రారంబిస్తున్న సర్పంచ్ పట్లూరి హైమావతి జగదీశ్వర్

## పదవులు కట్టబెట్టడంలో అధిష్టానందే తుది నిర్ణయం

**-కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు మహిపాల్ యాదవ్,నాయకులు**


మాట్లాడుతున్న యాలాల మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు

**యాలాల, జూన్ 1, ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీ బి,బ్లాక్ అధ్యక్షులు చెన్నారం అనీల్‌కుమార్ గుప్తా కరుడు గట్టిన కాంగ్రెస్ నాయకుడని యాలాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహిపాల్ యాదవ్, పార్టీ సీనియర్ నాయకులు గురురాజ్ జోషీ, అయ్యగాళ్ల భీమయ్య, మంగలి మల్లయ్య, ముకుందాపూర్ సాయిలు తదితరులు పేర్కొన్నారు. పార్టీ కష్ట కాలంలో ఉన్నప్పుడు పార్టీని వీడకుండా పార్టీ పటిష్టతకు తనవంతు కృషి చేశాడని వారు గుర్తు చేశారు. రాష్ట్రంలో పదేళ్ల అధికారానికి దూరమైన కాంగ్రెస్ పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు ఎంతో మంది కాంగ్రెస్‌కు గుడ్ బై చెప్పి వేరే పార్టీలో చేరినా అనీల్ మాత్రం ఏనాడు పార్టీని వీడలేదన్నారు. అధికారం ఉన్నా లేకున్నా పార్టీలో ఉంటూ సేవ చేశారన్నారు. నిస్వార్థంగా పార్టీ జెండా మోసిన వ్యక్తులకు ,కార్యకర్తలకు ,నాయకులకు పదవులు కట్టబెట్టడం కాంగ్రెస్ పార్టీలో సాంప్రదాయమని వారు వివరించారు. పదవులు వరించడంలో పార్టీలో సమిష్ట నిర్ణయంతో పాటు అధిష్టాన నిర్ణయం ఫైనల్ అని వారు తెలిపారు. అనీల్‌కు నామినేటెడ్ పదవి కెటాయించడంలో ఎమ్మెల్యే నిర్ణయం తీసుకుంటే పార్టీలో ఎవరికీ అభ్యంతరం లేదని వారు ముక్తకంఠంగా పేర్కొన్నారు. పదవుల కెటాయింపులో అధిష్టానానిదేనని, అందుకు పార్టీలో ఎవరూ వ్యతిరేకత, అభ్యంతరాలు ఉండవన్నారు. నామినేటేడ్ పదవికి చెన్నారం అనీల్‌కుమార్‌గుప్తా అన్ని విధాల అర్హుడని వారు కితాబిచ్చారు. కాగా యాలాల మండల పిఎసిఎస్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులుగా నామినేటెడ్ పదవి అనీల్‌కు కెటాయిస్తున్నట్లు మండలంలో చర్చ జరుగుతున్న నేపథ్యంలో పార్టీలో వ్యతిరేకత ఉందన్న వదంతులకు నాయకులు మీడియా సమావేశంలో చెక్ పెట్టారు. నామినెటెడ్ పదవుల విషయంలో ఎవరూ జోక్యం చేసుకోరని, ఎమ్మెల్యేదే ఫైనల్ నిర్ణయమన్నారు.

## విఓఎల సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి

**కుల్కచర్ల, జూన్ 1, ప్రభాతవార్త:** విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్లు(వీఓఎలు)తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. విఓఎలకు కనీస 20వేలవేతనం అందించాలని, సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి హెచ్‌ఆర్ పాలసి వర్తింప, జేయాలని, అర్హులైన విఓఎలలనుసిసిలుగా పదోన్నతులు కల్పించాలని, విఓఎలకు సాధారణ, ఆరోగ్య బీమా 20 లక్షలు కల్పించాలని, ప్రభుత్వం తమతో ఎక్కువగా ఫోన్ యాప్‌లతో పనిచేయిస్తుందని, దీనికిగాను ట్యాబ్‌లు ఇవ్వాలని, 58జీవోను సవరించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వీఓఎలు తదితరులు పాల్గొన్నారు.

# తెల్లబంగారానిదే పైచేయి

(మొదటి పేజీ తరువాయి)

పెరిగి 1,94,600 ఎకరాలకు చేరుకుంటుందని అధికారులు భావిస్తున్నారు. జిల్లాలో అత్యధిక విస్తీర్ణంలో సాగయ్యే ప్రధాన పంటగా పత్తి తన స్థానాన్ని నిలబె ట్టుకుంది. అయితే, వరి సాగు చేసే రైతులు మా త్రం ఈసారి కొద్దిగా వెనక్కి తగ్గినట్లు తెలు స్తోంది. పెట్టుబడి వ్యయం పెరగడం, మార్కెట్‌లో లాభసాటిగా ఉండే ఇతర వాణి జ్య పంటలపై ఆసక్తి పెరగడంతో వరి సాగు విస్తీర్ణం గత ఏడాదితో పోలిస్తే సుమారు రెండు వేల ఎకరాల వరకు తగ్గింది. ఈసారి వరి సాగు 1,60,385 ఎకరాలకే పరిమితం కానుంది. వీటికి భిన్నంగా తోటల పెంపకం, కూరగాయల వంటి ఉద్యాన పంటల సాగు వైపు రైతులు వేగంగా అడుగులు వేస్తున్నారు. గతంలో 44 వేల ఎకరాలుగా ఉన్న ఉద్యాన సాగు, ఈసారి ఏకంగా 52,452 ఎకరాలకు పెరగడం గమనార్హం.

మరోవైపు జిల్లాలో ఆహార పంటలైన మొక్కజొన్న 77,500 ఎకరాల్లో, కందులు 12 వేల ఎకరాల్లో సాగు కానున్నాయి. వీటితో పాటు జొన్నలు, వేరుశనగ, ఉలవలు వంటి ఇతర పప్పుధాన్యాలు, చిరుధాన్యాలను కూడా రైతులు పరిమిత విస్తీర్ణంలో సాగు చేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

వానాకాలం సాగుకు సంబంధించి జిల్లా వ్యవసాయ యంత్రాంగం కూడా అప్ర మత్తమైంది. ఇప్పటికే మండల అధికారులతో సమీక్షలు పూర్తి చేశామని జిల్లా వ్యవసాయాధికారి ఉష తెలిపారు. రైతులకు విత్తనాలు, ఎరువుల కొరత రాకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామని, ప్రభుత్వానికి కూడా నివేదికలు పంపామని స్పష్టం చేశారు. ఈ ఏడాది వర్షాలు సకాలంలో కురిస్తే దిగుబడులు అద్భుతంగా ఉంటాయని వ్యవసాయ నిపుణులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## రాజీనామా చేసిన ఆర్పీఈ చేతిలో మెప్మా రికార్డులు

(మొదటి పేజీ తరువాయి)

చర్యలు తీసుకోవాలని సుమారు 25 మంది మహిళలు, కౌన్సిలర్లు ప్రజా వాణిలో ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాల్సిం దిగా డీఆర్‌డీఓ (మెప్మా) జిల్లా అధికారి సాంబశివరావుకు రాసినట్లు వారు పేర్కొన్నారు.

**ఇందిరమ్మ ఇళ్ల బిల్లులు వెంటనే విడుదల చేయాలి**

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు పూర్తవుతున్నా, గత రెండు నెలలుగా బిల్లులు విడుదల కాకపోవడంపై సీపీఎం నాయకులు, లబ్ధిదారులు, భవన నిర్మాణ కార్మికులు కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేశారు.


నిరవధిక సమ్మెలో పాల్గొన్న విఓఎలు

## కాలయాపన చేయకుండా మా మొరాలకించండి

**పెద్దేముల్, జూన్ 1, ప్రభాతవార్త:** అర్హులైన విఓఎలను సిసిలుగా పదోన్నతి కల్పించాలని మండల విఓఎల సంఘం అధ్యక్షులు భాగ్యలక్ష్మి డిమాండ్ చేశారు. పెద్దేముల్ మండల తహసీల్దార్ కార్యాలయం ముందు విఓఎలు చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారంకు 15వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా మండల విఓఎల సంఘం అధ్యక్షులు భాగ్యలక్ష్మి, కార్యదర్శి అనంతయ్య, కోశాధికారి క్రిష్ణయ్య మాట్లాడుతూ విఓఎలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి హెచ్‌ఆర్ పాలసీ కల్పించాలని అన్నారు. విఓఎలకు నెలకు రూ.20 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సాధారణ ఆరోగ్య బీమా సౌకర్యం రూ. 20 లక్షలు కల్పించి, 58 జిఓను సవరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం కాలయాపన చేయకుండా విఓఎల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విఓఎలు గౌరమ్మ, నిర్మల, స్వప్న, వినోద, వెంకటమ్మ, నాగేష్, రాంచెంద్రి, శివకుమార్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

# పార్టీ బలోపేతానికి సభ్యత్వ నమోదు ముఖ్యం

**బిఆర్‌ఎస్ నియోజకవర్గ సభ్యత్వ నమోదు ఇంఛార్జి లక్ష్మారెడ్డి**

**ఘట్‌కేసర్ రూరల్, జూన్ 1, ప్రభాత వార్త:** బిఆర్‌ఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆపార్టీ నియోజకవర్గ సభ్యత్వ నమోదు ఇంఛార్జ్ రాగిడి లక్ష్మారెడ్డి అన్నారు. పోచారం డివిజన్ పరిధిలోని అన్నోజిగూడ తులిఫ్స్ హోటల్‌లో సోమవారం ఉమ్మడి ఘట్‌కేసర్ మండలంలోని పోచారం, ఘట్‌కేసర్, ఏదులాబాద్ కార్పొరేషన్ వార్డుల బిఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సభ్యత్వ నమోదు ఇంఛార్జి రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ బిఆర్‌ఎస్ బలోపేతానికి పార్టీ సభ్యత్వ నమోదు ముఖ్యమని అన్నారు. మూడు కార్పోరేషన్లలో 97 పోలింగ్ బూత్‌లున్నాయని బూత్ కమిటీల ప్రతినిధులు తమకు అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తించాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సర్ కార్యక్రమంలో బూత్ కమిటీ సభ్యులు చురుగ్గా పాల్గొని అక్రమ ఓట్ల తొలగింపును నివారించాలని కోరారు. భవిష్యత్తులో తెలంగాణలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పాటు అవుతుందని అన్నారు. బూత్ కమిటీ ప్రతినిధులు అన్ని విధాలుగా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక కార్యక్రమాలపై ప్రజల పక్షాన ఉండి ఉద్యమించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు చామకూర మహేందర్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షులు మందాడి సురేందర్‌రెడ్డి, బండారి శ్రీనివాస్ గౌడ్, పన్నాల కొండల్ రెడ్డి, పోచారం మాజీ మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ నానావత్ రెడ్యానాయక్, నాయకులు సామల పలుగుల మాధవరెడ్డి, సందీప్ రెడ్డి, శేఖర్ ముదిరాజ్, మేకల నర్సింగ్‌రావు, మందాడి సంజీవరెడ్డి, జక్కా వెంకట్‌రెడ్డి, మెట్టు బాల్‌రెడ్డి, యేదుగని కృష్ణమూర్తి ఆయా కార్పోరేషన్ వార్డుల నాయకులు, బూత్ కమిటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఈదులపల్లిలో గురుశిష్యుల భావోద్వేగం

**షాద్‌నగర్, జూన్ 1, ప్రభాతవార్త :** సుమారు మూడు దశాబ్దాల సుదీర్ఘ విరామం తర్వాత ఆ పాత స్నేహితులు మళ్లీ ఒక్కటయ్యారు. ఒకరినొకరు చూసుకోక ముప్పై ఏళ్లు గడిచినా, నాటి స్నేహం ఏమాత్రం తగ్గలేదని నిరూపించారు. ప్రగతి విద్యాలయం షాద్‌నగర్ 1996-97 విద్యా సంవత్సరానికి చెందిన నాటి విద్యార్థులు అందరూ కలిసి షాద్‌నగర్ నియోజకవర్గం ఈదులపల్లి శివారులోని కోకో ప్లమ్స్ రిసార్ట్‌లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనం అత్యంత వైభవంగా, అపూర్వంగా సాగింది. ప్రగతి విద్యాలయంలో ఆనాడు తక్కువ ఫీజుతో విద్యార్థులు చదివి ఈనాడు అంచలంచలుగా ఎదిగిన విద్యార్థులను చూసిఎంతో గర్వంగా ఉందని అన్నారు.

**గురుశిష్యుల భావోద్వేగ కలయిక**

ఈ కార్యక్రమానికి నాటి ఉపాధ్యాయులను ముఖ్య అతిథులుగా ఆహ్వానించి, విద్యార్థులు వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అప్పటి గురువులు రాధాకృష్ణ, నరేందర్, మధు సుదన్, మహమూద్ , కొండారెడ్డి, శశికాంత్, త్రివేణి తదితరులు మాట్లాడుతూ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. ఒక గురువుకు తన జీవితంలో లభించే అసలైన అవార్డు, గుర్తింపు.. తన చేతుల్లో పెరిగిన విద్యార్థులు సమాజంలో ఉన్నత స్థానాల్లో స్థిరపడటమే. ఈ రోజు 30 ఏళ్ల తర్వాత మా విద్యార్థులను ఇంతటి ఉన్నతమైన స్థానాల్లో చూస్తుంటే గురువులుగా మా జన్మ ధన్యమైందనిపిస్తోందని వారు కొనియాడారు.

చదువు పూర్తయ్యాక వివిధ రంగాల్లో, వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడిన నాటి స్నేహితులు.. ఈ వేదిక ద్వారా ఒకే చోట చేరడంతో రిసార్ట్ ప్రాంగణమంతా కోలాహలంగా మారింది. చిన్ననాటి అల్లరి పనులు, తరగతి గది జ్ఞాపకాలు, గురువుల శిక్షణ, ఆటపాటలను గురుచేసుకుంటూ నాటి విద్యార్థులు ఆనంద డోలికల్లో తేలియాడారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మాజీ ఎంపీటీసీ మల్కయ్య గారి భార్గవ కుమార్ రెడ్డి, మల్కయ్య గారి గోవర్ధన్ రెడ్డి, శ్రీకాంత్, పండరీనాథ్, వీరేందర్ రెడ్డి, సతీష్, జగదీష్, శ్రీనివాస్ కవిత, జ్యోతి, స్వప్న, గిరిజ రాధిక ,తదితర స్నేహ బృందం పాల్గొన్నారు.

# వ్యాపార సామ్రాజ్యాలు

(మొదటి పేజీ తరువాయి)

అవుతుందా? గడువు ముగిసిన తర్వాత చట్టపరమైన చర్యలు ఎందుకు తీసుకో లేదని ప్రశ్నిస్తున్నారు. హైడ్రా తీసుకుంటున్న చర్యల మూలంగా రాజధాని పరిసరాలలోని అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెడుతుంటే, రంగారెడ్డి జిల్లా అవురుపల్లిలో మాత్రం అధికారుల నిర్లక్ష్యం కారణంగా అక్రమ నిర్మాణాలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారి, సంబంధిత డివిజనల్, మండల స్థాయి అధికారులు స్పందించి, అవురుపల్లి గ్రామపంచాయతీ పరిధిలో జరుగుతున్న నిర్మాణాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు

# కూతవేటు దూరంలో క్రైమ్ జోన్

(మొదటి పేజీ తరువాయి)

సాయి అనే యువకుడు స్విమ్మింగ్ పూల్‌లో శవమై తేలడం కలకలం రేపిం ది. అయితే, అక్కడ కనీసం సీసీ కెమెరాలు కూడా లేకపోవడంతో అతడు ఎలా చనిపోయాడనేది ఇప్పటికీ మిస్టరీగానే మిగిలిపోయింది. పోలీసులు ఈ కేసులో ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని మృతుడి బంధు వులు ఆరోపిస్తున్నారు. ఫామ్‌హౌస్‌లలో విజిటర్స్ రికార్డులు లేకపోవడం దర్యాప్తుకు పెద్ద శాపంగా మారుతోంది.

**నిర్వాహకులతో లాలూచీ..?**

మరోవైపు, పుట్టగొడుగుల్లా వెలుస్తున్న ఈ ఫామ్‌హౌస్‌ల నిర్వాహకులతో కొందరు పోలీసులు కుమ్మక్కయ్యారని, నెలవారీ మామూళ్ల వసూళ్లకు పాల్పడుతూ అక్రమాలను చూసీచూడనట్లు వదిలేస్తున్నారనే ఆరోపణలు స్థానికంగా బలంగా వినిపిస్తున్నాయి. మొయినాబాద్ మండలం పూర్తిగా నేరాల నిలయంగా మారకముందే పోలీస్ శాఖ మేల్కోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఫామ్‌హౌస్‌లపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి.. సిసి కెమెరాల ఏర్పాటు, విజిటర్స్ రిజిస్టర్ల నిర్వహణ, ముందస్తు అనుమతుల వ్యవస్థను కట్టుదిట్టం చేయాలని కోరుతున్నారు.


స్విమ్మింగ్ పూల్‌లో ఓ యువకుడి మృతి మిస్టరీ మారింది ఇక్కడే..

**ఫామ్ హౌస్‌లపై ప్రత్యేక డ్రైవ్ : ఎస్‌హెచ్‌ఓ మల్లికార్జున రెడ్డి**

మొయినాబాద్ మండలంలోని ఫామ్ హౌస్‌లు, రిసార్ట్స్‌పై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నాం. ఇందులో భాగంగా వీటికి సంబంధించి గ్రామాల వారీ సేకరిస్తుం. ఫామ్ హౌస్‌లకు వచ్చి వెళ్లే వారి వివరాలను నమోదు చేసేందుకు యజ మానులకు ప్రత్యేక రికార్డు పుస్తకాలు అందజేస్తున్నాం. నేరాల నియంత్రణ, దర్యాప్తు సులభతరం చేయడమే ఈ చర్యల ప్రధాన ఉద్దేశం.



# విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి

**కొడంగల్, జూన్ 1, ప్రభాతవార్త:** విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతిచెందిన సంఘటన మండల పరిధిలోని పర్సాపూర్‌లో చోటుచేసుకుంది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం పర్సాపూర్ గ్రామానికి చెందిన గొల్ల లింగప్పకు చెందిన ఎద్దులను రోజుమారిగానే సోమవారం ఉదయం మేత కోసం పొలానికి తీసుకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన చిల్ముల పద్మమ్మ వ్యవసాయ పొలంలో గల ట్రాన్స్ ఫార్మర్ తీగలు తగిలి ఎద్దు మృతిచెందిందని బాధిత రైతుల వాపోయారు. మృతి చెందిన ఎద్దు విలువ సుమారు రూ. 95వేల వరకు ఉంటుందని, ప్రభుత్వం తనను ఆదుకోవాలని రైతు లింగప్ప కోరారు.


విద్యుత్ షాక్‌తో మృతి చెందిన ఎద్దు